

2న శ్రీకూర్మనాథుని తెప్పోత్సవం

గార, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని తెప్పోత్సవం నవంబరు 2న కార్తీక శుద్ధ ద్వాదశి రోజున (క్షీరాబ్ది ద్వాదశి) సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.నరసింహనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం ఎదురుగా ఉన్న శ్వేత పుష్కరిణిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. భక్తులు తరలివచ్చి ఈ ఉత్సవాన్ని తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

టీచర్లకు కొత్త టె(స్ట్)ట్



- సుప్రీం కోర్టు తీర్పుతో ఆందోళన
- ఉపాధ్యాయ అర్హత పరీక్షపై విస్తృత చర్చలు
- జిల్లాలో 9,800 మందిపై ప్రభావం



నరసన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీసు టీచర్లు సైతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సిందేనంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగులు, టీచర్లు ఇద్దరూ టెట్ రాసేందుకు వీలుగా త్వరలో నోటిఫికేషన్ జారీ చేయడానికి పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. దీంతో 2010వ సంవత్సరానికి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుల్లో కలవరం మొదలైంది. టెట్ పరీక్షపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు అధికారిక ప్రకటనేదీ లేకపోయినా గతంలో జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి జారీ చేసిన నోటిఫికేషన్, తాజాగా సుప్రీం తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 14,300 మంది టీచర్లు..

జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో 14,300 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో 9,800మంది టెట్‌లో ఉత్తీర్ణత కావాల్సి ఉంది. టెట్‌కు ప్రిపేర్‌కావడం, ఉత్తీర్ణత సాధించడం మినహా ప్రత్యామ్నాయం లేదని వారు భావిస్తున్నారు. దశాబ్దాల బోధనానుభవం ఉన్న టీచర్లు మళ్లీ ఇప్పుడు అర్హత పరీక్ష (టెట్) ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీం తీర్పుపై అప్పీల్‌కు వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 1998 డీఎస్సీ నుంచి 2006 డీఎస్సీ వరకు ఎంపికైన ఉపాధ్యాయులే ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా పనిచేస్తున్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సుమారు 2,300 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో సుమారు 12వేల మంది పనిచేస్తున్నారు. వీరిలో 2012 డీఎస్సీ నుంచి ఇటీవల నిర్వహించిన 2025 మెగా డీఎస్సీ వరకు ఎంపికైన వివిధ పాఠశాలల్లో సుమారు 4,500 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరు మినహా మిగతా 9,800 మంది టెట్ రాయాల్సి ఉంది. దీంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.

అసలు ఏంటీ సమస్య..

ఉపాధ్యాయ విద్యకు సంబంధించి డీఎడ్, బీఎడ్ అర్హతలున్నప్పటికీ, ఉద్యోగ నియామకాలకు అర్హత పరీక్ష టెట్‌లో ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టులో ఎన్సీటీఈఆర్టీ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికనుగుణంగానే తదుపరి ఉపాధ్యాయ నియామకాలన్నింటికీ టెట్‌ను తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఆ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2012 రిక్రూట్‌మెంట్ నుంచి టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేశారు. ఆ తర్వాత 2014, 2018 తాజాగా మెగా డీఎస్సీ -2025 నియామకాలన్నీ టెట్ ఉత్తీర్ణులతోనే జరిగినందున వీరి విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తే అవకాశం లేదు. ఈ క్రమంలో గతంలో అంటే 2010 కి ముందు ఉద్యోగంలో చేరిన టీచర్లు కూడా ఇప్పుడు టెట్‌రాసి అర్హత సాధించాల్సిందేనని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పునివ్వడం, ఆమేరకు రెండేళ్లలోపే టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని నిబంధన విధించడం.. ఉపాధ్యాయుల్లో ఆందోళనకు కారణమైంది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం ఐదేళ్లకు పైబడి ఉద్యోగ కాలం ఉన్న టీచర్లంతా రెండేళ్ల వ్యవధిలో టెట్‌రాసి ఉత్తీర్ణులు కావాల్సిందే. అలా ఉత్తీర్ణత కాకపోతే ఉద్యోగంలో కొనసాగింపుపై టీచర్లలో డైలామా నెలకొంది.

ఒకవేళ టెట్ ఉత్తీర్ణత తప్పనిసరైతే..

150 మార్కులకు రెండున్నర గంటల వ్యవధితో ఉండే ఈ పరీక్షలో అర్హత సాధించడానికి (మిగతా 6వ పేజీలో..)



లావేరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

జిల్లా వ్యాప్తంగా ఓపెన్‌హౌస్

- ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల అవగాహన

7లో




రవీంద్రభారతి పాఠశాల సీజ్

- రూ.30 లక్షల ఈఎస్ఐ బకాయిలు
- కార్మికశాఖ అధికారుల చర్యలు

7లో

భూములు అమ్ముకునేదెలా?

- 22-ఏ జాబితాలోకి 64.5 ఎకరాలు
- 40 సెంట్ల కోసం వాటిని నిషేధిత జాబితాలో చేర్చిన వైనం
- అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు
- పొందూరు పట్టణ ప్రజల ఇబ్బందులు



పొందూరు పట్టణ వ్యూ

పొందూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం పొందూరు పట్టణవాసుల పాలిట శాపంగా మారింది. 40 సెంట్ల స్థలం కోసం దేవదాయశాఖ అధికారుల సూచనలతో రెవెన్యూ అధికారులు పొందూరులో ఉన్న మొత్తం భూములను 22-ఏ పరిధిలోకి చేర్చారు. దీంతో ఆ భూముల రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. తమ అవసరాల కోసం భూములను విక్రయించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆరేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

పొందూరు పట్టణంలో సర్వే నెంబరు 163-1లో 64.5 ఎకరాల జిరాయితీ భూములు, ఇళ్ల స్థలాలతో పాటు ఓగ్రామ కంఠం కూడా ఉంది. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వంలో 163-1 సర్వేనెంబరులో రిజిస్ట్రేషన్లు జరగడంతో క్రయవిక్రయాలు జరిగేవి. ఈ సర్వే నెంబరులో దేవదాయశాఖకు 40 సెంట్ల స్థలం ఉందని ఆ శాఖాధికారులు వైసీపీ ప్రభుత్వంలో 2020లో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు ఎటువంటి ఆలోచన చేయకుండా 163-1 సర్వేనెంబరులో 64.5 ఎకరాల భూమిని, ఇళ్లస్థలాలను 22-ఏ జాబితాలోకి చేర్చేశారు. అప్పటి నుంచి ఆ సర్వేనెంబర్‌లోని భూములు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. 40 సెంట్ల స్థలం కోసం మొత్తం భూములన్నీ నిషేధిత జాబితాలోకి ఎలా చేర్చారని అధికారులను పట్టణవాసులు నిలదీస్తున్నారు. ఈ భూములు దేవదాయ శాఖ జాబితాలోకి వెళ్లిపోయాయని, ఆ శాఖ కమిషనర్ తొలగిస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఈ సమస్యను అప్పటి ఆమదాలవలస ఎమ్మెల్యే, స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి పొందూరు ప్రజలు తీసుకువెళ్లారు. అయినప్పటికీ పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి సమస్యను బాధితులు (మిగతా 6వ పేజీలో..)

మూతపడిన ఉద్దానం ప్రాజెక్టు



టి.శాసనం వద్ద నిరుపయోగంగా ఉన్న ఉద్దానం ప్రాజెక్టు ప్రధాన కార్యాలయం

- మెగా కనస్ట్రక్షన్‌లో విలీనం
- 81 మంది ఉద్యోగులను తొలగించిన సంస్థ
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఉద్దానం సమగ్ర సురక్షిత మంచినీటి సరఫరా పథకం మూతపడింది. ఈ ప్రాజెక్టులో 113 మంది పనిచేస్తుండగా, ఒకేసారి 81 మందిని నిర్వహణ సంస్థ తొలగించింది. దీంతో వారంతా వీధిన పడ్డారు. ఏంచేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి నియోజకవర్గ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండడంతో 27 ఏళ్ల కిందట అప్పటి కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు, అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ కృషి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్దానం మంచినీటి పథకాన్ని మంజూరు చేసింది. ఏకంగా రూ.50 కోట్ల నిధులతో మహేంద్ర తనయా, బాహుదా నదుల్లో ఇన్‌ఫిల్టరేషన్ బావులు ఏర్పాటు చేశారు. వీటిద్వారా ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాల్లో 290 గ్రామాలకుపైగా తాగునీరు అందేది. అప్పట్లో 150 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. తరువాత కాలంలో ఈ ఉద్యోగుల సంఖ్య 113కి తగ్గింది. వీరి జీతం తక్కువ. అది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. ఇటీవల ఉద్దానం ప్రాజెక్టును మెగా కనస్ట్రక్షన్‌లో విలీనం చేశారు. అందులో పనిచేస్తున్న 113 మంది ఉద్యోగులు కూడా విలీనమయ్యారు. కానీ, ఏ కారణం లేకుండా ప్రతి నెలా ఉద్యోగులను మెగా కనస్ట్రక్షన్ కంపెనీ తొలగిస్తోంది. ఇప్పటి వరకు ఏకంగా 81 మందిని తొలగించింది. దీంతో వారంతా ఆందోళనబాట పట్టారు. తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని చెబుతున్నారు. ఈ విషయంలో జిల్లా మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు కలుగజేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అప్పట్లో జడ్పీ పరిధిలో..

టీడీపీ ప్రభుత్వాలు ఏర్పడిన ప్రతిసారి ఉద్దానం ప్రాజెక్టు నిర్వహణ, ఉద్యోగుల జీతాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండేవి లేవు. ఈ బాధ్యతను జిల్లా పరిషత్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చూసేది. పది నెలలకు ఒకసారి వారికి జీతాలు చెల్లించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వీరి కష్టాలు రెట్టింపయ్యాయి. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని కిడ్నీ వ్యాధిగ్రస్థులకు రక్షిత మంచినీటి జలాలు అందించాలన్న ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఒక ప్రయత్నం జరిగింది. అటు తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో..)

జల్‌జీవన్ పనుల్లో జాప్యం తగదు

- అలా చేస్తే కాంట్రాక్టులను రద్దు చేస్తాం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'జల్‌జీవన్‌మిషన్ పనుల్లో జాప్యం తగదు. అగ్రిమెంట్ పూర్తయినా ఇంతవరకు ప్రారంభించని పనుల కాంట్రాక్టులను రద్దు చేస్తాం' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆయన జేజేఎం పనులపై సమీక్ష నిర్వహించారు. వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. లేకపోతే రీటెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. సురక్షితమైన తాగునీరు అందించే అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈపథకంలో జాప్యం తగదన్నారు. ఇదే చివరి అవకాశమన్నారు. అధికారులు నుంచి అందిన నివేదిక ప్రకారం జిల్లాలో మొత్తం 4,87,307 ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇంకా 2,6,499 కనెక్షన్లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరులోగా పనులు వేగాన్ని పెంచకపోతే అధికారులపై కూడా చర్యలు ఉంటాయని అన్నారు. ఈ డిసెంబర్ నాటికి పూర్తికావాలని, ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఈసమావేశంలో డీపీవో భారతి సౌజన్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

స్పందించని అధికారులపై చర్యలు తప్పవు

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

8లో



పిడుగులు పడకుండా..

- గ్రానైట్ క్వారీల్లో లైటెనింగ్ అరెస్టర్లు
- యజమానులకు ఆదేశాలు

6లో



ఎన్‌ఆర్‌ఈజీఎస్

- జిల్లాకు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

అంబుడ్స్‌పర్సన్‌గా గురుమూర్తి

శ్రీకాకుళం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) జిల్లా పరిధిలో ప్రజా ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు ప్రభుత్వం జిల్లాల వారీగా అంబుడ్స్‌పర్సన్‌లను నియమించింది. శ్రీకాకుళం జిల్లాకు ఐ.గురుమూర్తిని అంబుడ్స్‌పర్సన్‌గా నియమిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఈయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రతి సమావేశానికి రూ.2,250 హాజరు భత్యం, గరిష్ఠంగా నెలకు రూ.45వేల వరకు పారితోషకం ప్రభుత్వం చెల్లించనుంది. ఈయన ఉపాధి హామీ వేతనదారులు, ఇతరుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిశీలన చేసి, అనంతరం జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, రాష్ట్ర నోడల్ విభాగానికి నివేదిక పంపాల్సి ఉంటుంది. అలాగే ప్రతి మూడు మాసాలకు నివేదికలను ప్రధాన కార్యదర్శికి, రాష్ట్ర నోడల్ విభాగానికి అంబుడ్స్‌పర్సన్ పంపించాలి. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విభాగం కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులను జారీచేశారు.

కార్తీక కళ

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

6లో



పెద్దమడి గురుకులంలో సమస్యల తిష్ఠ

- చాలీచాలని వసతితో విద్యార్థుల అవస్థలు
- తరగతి గదుల్లోనే చదువు, నిద్ర
- కానరాని ఆర్వోప్లాంట్
- బోధనా సిబ్బంది కొరత


మెళియాపుట్టి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దమడి గిరిజన బాలుర గురుకుల కళాశాలలో సమస్యలు తిష్ఠ వేశాయి. ఇక్కడ విద్యార్థులకు సరిపడ గదులు లేవు. ఉన్న గదులకు గచ్చులు లేవు. విద్యార్థుల చదువు, నిద్రపోవడం, వంట అన్నీఒకే చోటనే. ఆర్వో ప్లాంట్ లేక బోరు నీటినే వారు తాగుతున్నారు. బోధన సిబ్బంది కొరత ఉంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఈ గురుకుల కళాశాలను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంపైనే విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు. గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో సుమారు 30 ఏళ్ల కిందట పెద్దమడి గ్రామంలో పది ఎకరాల్లో గురుకుల (మిగతా 6వ పేజీలో..)



సదుపాయాలకు నోచుకోని పెద్దమడి గురుకుల కళాశాల ఇదే



ఎండల మల్లికార్జున స్వామి



భీమేశ్వరాలయం



శ్రీముఖలింగేశ్వరాలయం

కార్తీక కళ

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

శివాలయాలకు కార్తీక కళ వచ్చింది. బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభమైంది. దీంతో జిల్లాలోని వివిధ శివాలయాల్లో భక్తులు పూజలు చేసేందుకు అనువుగా ఏర్పాట్లు చేశారు. కార్తీకంలో నెల రోజుల పాటు శివాలయాలను భక్తులు దర్శించుకుంటారు. సోమవారాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

నరసన్నపేట/టెక్కలి/హిరమండలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని శైవక్షేత్రాల్లో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో శ్రీముఖలింగం, రావివలస ఎండల మల్లికార్జునస్వామి, శ్రీకాకుళం పట్టణంలోని ఉమారుద్ర కోటేశ్వర, అరసవెల్లి సూర్యనారాయణ స్వామి, అయ్యప్ప తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. నవంబరు 22 వరకు కార్తీక మాసం ఉంటుందని పండితులు చెబుతున్నారు. ఈ నెల 24న భగినీ హస్తభోజనం, 25న నాగుల చవితితో పాటు సోమవారాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. గ్రామాలు నెల రోజుల పాటు కార్తీక దీపాలతో కళకళలాడనున్నాయి. ఆలయ ప్రాంగణాల్లో ఆకాశదీ పాలు వెలిగించడం, తులసి, ఉసిరి చెట్లు దగ్గర పూజలు చేయడం, కార్తీక పురాణాలు చదవడం వంటి కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సందడి కనిపిస్తుంది. శివాలయాలకు వెళ్లే భక్తులు మారేడు (బిల్వపత్రం)తో పాటు జిల్లేడు పువ్వులు, గన్నేరుపువ్వులు, పారిజాతం, శంఖం పువ్వులు, ఉమ్మెత్త, తదితర పూలతో పూజలు చేస్తుంటారు. నాగావళి, వంశధార నదుల్లో పుణ్యస్నానాలకు శ్రీకాకుళం, మడపాం, గార, కరజాడ తదితర ప్రాంతాల్లో రేవులను సిద్ధం చేశారు.

కార్తీక స్నానం పుణ్యప్రదం..

కార్తీక మాసంలో నదులు, చెరువుల్లో తెల్లవారుజామునే స్నామాచరించడం వల్ల పుణ్యఫలం వస్తుందని భక్తుల విశ్వాసం. నిత్యం వీలుకాని వారు సోమవారాలు, శుద్ధ ద్వాదశి, చతుర్దశి, పౌర్ణమి రోజుల్లో స్నానాలు ఆచరిస్తే మంచిదని పండితులు చెబుతారు.

కార్తీక సోమవారం ప్రత్యేకత..

కార్తీక సోమవారాల్లో ప్రత్యేక పూజల వల్ల శివానుగ్రహం కలుగుతుందని పండితులు చెబుతున్నారు. శివుడికి ఇష్టమైన రోజు సోమవారం కావడంతో కార్తీక మాసంలో వచ్చే అన్ని సోమవారాలు ప్రత్యేకమైనవే. ఈ వారాల్లో ప్రత్యేకమైన వ్రతాలు, దీపారాధన, ఉపవాస దీక్షలు చేపట్టడం ద్వారా శివుడి అనుగ్రహం పొందుతామని అంటున్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు..

సత్యనారాయణస్వామి వ్రతానికి ఎంతో ప్రత్యేకత ఉంది. అందులో ఈ మాసంలో వ్రతాన్ని ఆచరించడం వల్ల సకల ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడని ప్రతీతి.

ఉపవాస ఫలం..

కార్తీక మాసంలో సోమవారాలు, పౌర్ణమి రోజుల్లో ఉపవాస దీక్షల వల్ల కొన్ని ప్రత్యేకమైన ఫలితాలు కలుగుతాయని అంటారు. ఉపవాసం ఉన్న రోజున ఉదయాన్నే లేచి చన్నీటి స్నానం అనంతరం స్థానిక శివ, విష్ణువు ఆలయాల్లో దీపారాధన చేసి కార్తీక పురాణం పఠిస్తే పూర్వజన్మ కర్మలు తొలగి పుణ్యఫలం లభిస్తుందని చెబుతారు. ప్రత్యేక రోజుల్లో పేదవారికి అన్నదానం చేయడం శ్రేయస్కరం.

గోపూజ..

కార్తీక మాసంలో భగవంతుడి అనుగ్రహం తేలికగా పొందడానికి గోపూజ దోహదపడుతుందని పండితులు చెబుతారు. ముక్కోటి దేవతలు గోవులో నిక్షిప్తమై ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక మాసంలో గోవుకు పూజ చేయడం వల్ల సకల దేవతానుగ్రహం పొందవచ్చునని భక్తుల విశ్వాసం.

దీపారాధన..

కార్తీకమాసంలో స్నానానంతరం దీపాలను వెలిగిస్తే సర్వపాపాలు హరించుకుపోతాయని ప్రతీతి. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో లేదా పౌర్ణమి నాడు సాయం సమయాల్లో ఉసిరికాయలపైన ఒత్తులను వేసి.. ఆవు నెయ్యి లేదా నువ్వుల నూనె, కొబ్బరి నూనె, విప్ప నూనె, ఆముదంతో గానీ వెలిగించి దీపారాధన చేయడం వల్ల ముక్తి లభిస్తుందని పండితులు పేర్కొంటున్నారు. ఈ మాసంలోనే అత్యధికంగా అయ్యప్ప భక్తులు మాలధారణ చేస్తారు.

కార్తీక పౌర్ణమి విశిష్టత..

నవంబరు 5న బుధవారం కార్తీక పౌర్ణమి వస్తుంది. ఆ రోజున పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన జ్వాలాతోరణ ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు ఉసిరి దానం చేయడం వల్ల దారిద్ర్యం తొలగిపోతుందని నమ్మకం. పౌర్ణమి రోజున శివునికి అభిషేకం చేయడం వల్ల ఆయుష్షు పెరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక పౌర్ణమి రోజున లలితాదేవిని సహస్ర నామార్చన చేస్తే.. సకల ఐశ్వర్యాలు లభిస్తాయని, తులసి మొక్కలతో పాటు ఉసిరి కొమ్మను పెట్టి, పక్కన రాధాకృష్ణుల విగ్రహాన్ని ఉంచి పూజిస్తే పెళ్లి కాని యువతులకు వివాహమవుతుందని పురాణాలు చెబుతున్నాయి.

నదీస్నానం పుణ్యఫలం..



కార్తీక మాసంలో ప్రతిరోజూ పుణ్య దినమే. నిత్యం నదీస్నానం చేసి దీప దర్శనం చేసుకోవడం వల్ల పాపభీతి తొలగి, హరిహరుల కృపకు పాత్రుల వుతాం. అంతేకాకుండా ఈ సమయంలో దానాలు చేయడం శుభప్రదం.

-బి.శివసంతోష్‌కుమార్, నీలకంఠేశ్వర స్వామి ఆలయ అర్చకులు, నరసన్నపేట

శివకేశవులకు ప్రీతికరమైన మాసం..

హిందూ సంప్రదాయంలో శివకేశవులిద్దరికీ ప్రీతికరమైన మాసం కార్తీకం ఒక్కటే. ఇటు కార్తీక సోమవారాలు, నాగుల చవితి వంటి పర్వదినాలు, అటు ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి వంటి పర్వదినాలు ఈ మాసంలోనే వస్తాయి. కార్తీకంలో ఉసిరి చెట్టునీడలో సాలగ్రామాలకు పూజలు చేస్తారు.

-దుర్గామల్లికార్జున స్వామి, అర్చకులు, భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం, నరసన్నపేట

ముక్తిధామం.. శ్రీముఖలింగం

జలుమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెంది... భక్తకోటిని పునీతులను చేస్తున్న దివ్య క్షేత్రం శ్రీముఖలింగం. వంశధార నదీ తీరాన వెలసిన స్వామి ముఖలింగేశ్వరుడిగా పూజలందుకుంటున్న పుణ్యస్థలం. పరమ శివుడు ముఖాకృతి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్న ఏకైక ఆలయం శ్రీముఖలింగం. శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకుంటే ముక్తికి మార్గం దొరుకుతుందని భక్తుల విశ్వాసం. ఈ పుణ్యక్షేత్రం కాశీకి సమానమైనదిగా అగస్త్య మహర్షికి కుమార స్వామి వివరించినట్టు పురాణాలు చెబుతున్నాయి. జలుమూరు మండలంలోని పవిత్ర వంశధార నది ఒడ్డున.. శ్రీకాకుళానికి 50 కి.మీ. దూ రంలో ఈ క్షేత్రం ఉంది. శ్రీముఖలింగం అనగా పరమేశ్వరుని యొక్క ముఖం లింగంలో కనిపించడమని అర్థం. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేస్తే మోక్షం సిద్ధిస్తుందని శాసనాలు చెబుతున్నాయి. శ్రీముఖలింగంలో మూడుచోట్ల ముక్కోణపు ఆకారంలో 3 ఆలయాలున్నాయి. వాటిలో ప్రధానమైనది మధుకేశ్వరాలయం. దీనికి అభిముఖంగా కొంతదూరంలో భీమేశ్వర ఆలయం ఉంది. ఈ రెండు ఆలయాలకు కాస్త దూరంగా.. ఊరి ప్రారంభంలో అధునాతన వాస్తు పద్ధతిలో నిర్మించిన సోమేశ్వరాలయం సందర్శకులకు ఆహ్వానం పలుకుతున్నట్లు కనిపిస్తుంది.

భక్తుల దర్శనానికి ఏర్పాట్లు..

ఏటా కార్తీక సోమవారాలు, మహాశివరాత్రి పర్వదినం నాడు, లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు. బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభమైంది. ఈ మాసంలో 4 సోమవారాలు వస్తున్నాయని అర్చకులు నారాయణమూర్తి తెలిపారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో ఏడుకొండలు తెలిపారు.

విద్యుత్ కాంతులు..

కంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో కంచిలి మండల కేంద్రంలో అన్ని శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మరోవైపు ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకొని పూజలు చేశారు.



విద్యుత్ అలంకరణలో కంచిలిలోని శివాలయం

శివాలయాల్లో భక్తుల పూజలు..

నరసన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బుధవారం తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. స్థానిక భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, నీలకంఠేశ్వర, ఉమామహేశ్వర, సోమేశ్వర స్వామి ఆలయాలతో పాటు కరగాం, కంబకాయి, ఉర్లాం, మాకివలస, కోమర్తి, బొరిగివలస, చిన్నబొరిగివలస, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. మడపాం వద్ద వంశధార నది, నరసన్నపేట పట్టణంలో వంశధార కాలువ, గోరువాని చెరువులో మహిళలు దీపారాధన చేశారు. స్థానిక సిద్ధాశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు.



నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



టెక్కలిలోని గ్రానైట్ క్వారీ



పిడుగులు పడకుండా...

- గ్రానైట్ క్వారీల్లో లైటెనింగ్ అరెస్టర్లు
- యజమానులకు ఆదేశాలు

టెక్కలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీల్లో పిడుగుపాటుతో వరుస ప్రమాదాలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు ఇటీవల కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మైనింగ్ అధికారులు శ్రీకాకుళంలో క్వారీ యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు వారికి కొన్ని సూచనలు చేశారు. ప్రతీ గ్రానైట్ క్వారీలో పిడుగులు పడకుండా లెటెనింగ్ అరెస్టర్లను అమర్చాలని సూచించారు. జిల్లాలో టెక్కలి, నందిగాం, పలాస, మందస, కవిటి, పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట, కోటబొమ్మాళి, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో సుమారు 60కిపైగా ఉన్న గ్రానైట్ క్వారీల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. మే 16న మెళియాపుట్టి మండలం పాలూరు సమీపంలో పిడుగుపడి ముగ్గురు మృత్యువాత పడడం.. ఈనెల 7న గంగరాజపురం సమీపంలోని గ్రానైట్ క్వారీలో పిడుగుపడి మరో ముగ్గురు మరణించిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా యంత్రాంగం ఈ చర్యలు చేపట్టింది. గ్రానైట్ క్వారీల్లో ఏమి జరుగుతోందో గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ వేస్తామని ఇటీవల కలెక్టర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో సంబంధిత యాజమాన్యాలు లైటెనింగ్ అరెస్టర్ల ఏర్పాటు దిశగా యోచిస్తున్నాయి.



మాట్లాడుతున్న డాక్టర్ జ్ఞాన్ యల్లా

క్వాంటమ్ ప్రోగ్రామింగ్‌తో ఉజ్వల భవిత

- కొనసాగుతున్న క్విస్కిట్ పాల్ ఫెస్ట్

ఎచ్చెర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ ప్రోగ్రామింగ్‌తో ఉజ్వల భవిత ఉంటుందని డేటా టెక్ సీఈవో, క్వాంటమ్ మిషన్ లెర్నింగ్, హైబ్రిడ్ అల్గారిథమ్ పరిశోధకుడు డాక్టర్ జ్ఞాన్ యల్లా అన్నారు. ఎస్ఎంపురం పరిధిలోని ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఐబీఎం క్వాంటమ్ క్విస్కిట్ పాల్ ఫెస్ట్ -2025లో రెండో రోజైన బుధవారం ఆయన ప్రసంగించారు. సాంకేతిక సమస్యలపై మెరుగైన అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు నిజ జీవిత క్వాంటమ్ అనువర్తనాలను అన్వేషించి.. వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆస్ట్రేలియా బాండ్ విశ్వ విద్యాలయం సొసైటీ అండ్ డిజైన్ ఫ్యాకల్టీ సహ ఆచార్యులు గ్రెగోరీ జె.స్కుల్మోస్కీ వర్చువల్ వేదికగా మాట్లాడుతూ క్వాంటమ్ పురోగతిని సాధించడంలో సాంకేతిక నిపుణులు, ప్రాజెక్ట్ లీడర్ల మధ్య సహకారం ప్రాముఖ్యతను వివరించారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన క్రిప్టాలజిస్ట్, సమాచార సిద్ధాంత నిపుణులు డాక్టర్ గౌతమ్‌పాల్ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ క్వాంటమ్ క్రిప్టోగ్రఫీలో వస్తున్న కొత్త అంశాలు, సమాచార భద్రతపై వాటి ప్రభావాన్ని వివరించారు. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఎఫ్‌వో వాసు, సమన్వయకర్తలు రవి, రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూములు అమ్ముకునేదెలా?

(ఐదో పేజీ తరువాయి)

తీసుకువెళ్లారు. ఆయన సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తోన్నారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వంలో పొందూరు పట్టణానికి చెందిన కీలక నాయకులు సమస్య పరిష్కారం కాకుండా మోకాలడ్డగా, ప్రస్తుత అధికారపార్టీ నాయకులు కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై పట్టణ ప్రజలు పోరాటానికి సిద్ధమవుతున్నారు.

మా బాధలు పట్టడం లేదు..

మా బాధలు అధికారులకు ఏ మాత్రం పట్టడంలేదు. పొందూరు పట్టణ పరిధిలో ఇళ్లు, స్థలాలు ఉన్నా అవసరాలకు అమ్ముకోలేకపోతున్నాం. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మా భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించాలి.

-జి.సాయిరాజ్, వ్యాపారి, పొందూరు

ఆదేశాలు వచ్చాకే రిజిస్ట్రేషన్లు..

163-1 సర్వేనెంబరులోని భూములు 22-ఏ జాబితాలో ఉండడంతోనే రిజిస్ట్రేషన్లు జరగడంలేదు. 22-ఏ జాబితా నుంచి తొలగించినట్లు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాకే ఆ భూములకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి.

-రవిశంకర్, సబ్‌రిజిస్ట్రార్, పొందూరు

మూతపడిన ఉద్దానం ప్రాజెక్టు

(ఐదో పేజీ తరువాయి)

రూ.700 కోట్లతో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసింది. అప్పటివరకూ ఉన్న ఉద్దానం మంచినీటి పథకాన్ని, అందులో పనిచేస్తున్న వారి విషయంలో ఎటువంటి స్పష్టతనివ్వలేదు. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉద్దానం ప్రాజెక్టును, అందులో పనిచేస్తున్న ఉద్యోగులను మెగా కంపెనీలో విలీనం చేసింది. దీంతో ఉద్దానం ప్రాజెక్టుకు చెందిన 113 మంది మెగా కంపెనీలోకి బదలాయింపు జరిగింది. కానీ, ఇప్పుడు ఏకంగా 90 మందిపై ఆ కంపెనీ వేటు వేసింది. మరికొంతమందిని కూడా తొలగించేందుకు సిద్ధపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఉద్దానం ప్రాజెక్టు ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు.

దారుణం..

మాపట్ల మెగా కంపెనీ దారుణంగా వ్యవహరిస్తోంది. గత 20 సంవత్సరాలుగా ఉద్దానం ప్రాజెక్టులో సేవలందిస్తున్నాను. వేతనం నెలకు రూ.12 వేలుగా ఉంది. పీఎఫ్, ఈఎస్ఐ కట్ అవుతుందని చెప్పారు కానీ.. అందుకు సంబంధించి ధ్రువీకరణ కూడా లేదు. ఎప్పుడుకైనా గుర్తించకపోతారా? జీతం పెంచకపోతారా? అన్న కోణంలో పనిచేశాం. కానీ ఇప్పుడు ఉద్యోగం నుంచే తొలగించారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి.

-ముంజేటి వైకుంఠరావు, ఉద్దానం ప్రాజెక్టు ఉద్యోగి

ప్రభుత్వమే ఆదుకోవాలి..

వయసును కారణంగా చూపి నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. నాకు మరో ప్రత్యామ్నాయ ఉపాధి లేదు. ఎలా బతకాలో కూడా తెలియడం లేదు. అర్ధరాత్రి సమాచారం ఇచ్చారు. మిమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు స్పందించాలి. న్యాయం చేసి మా ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి.

-బురెల్లి బాలయ్య, ఉద్దానం ప్రాజెక్టు ఉద్యోగి



గచ్చులు లేని తరగతి గది

పెద్దమడి గురుకులంలో సమస్యల తిష్ట

(ఐదో పేజీ తరువాయి)

పాఠశాల/కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆరు తరగతి గదులు ఉన్నాయి. రెండు డార్మెటరీ గదులు ఉన్నాయి. ఈ కళాశాలలో 185 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే, గతంలో ఉన్న కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.80 లక్షలు మంజూరు చేసి కొత్త భవనం నిర్మించింది. గచ్చులు, చెక్కసున్నాలు (ప్లాసింగ్) చేయాల్సిన సమయంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆ పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి గచ్చులు లేని తరగతి గదుల్లోనే విద్యార్థులకు అధ్యాపకులు పాఠాలు చెబుతున్నారు. విద్యార్థులు పడుకోవడానికి రెండు గదులే ఉండడంతో అవి సరిపోవడం లేదు. ఒకే గదిలో వంద మంది వరకు నిద్రపోతున్నారు. తామంతా దగ్గరగా పడుకోవడం వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

బోరు నీరే దిక్కు..

గురుకుల కళాశాలలో ఆర్వో ప్లాంట్ లేకపోవడంతో విద్యార్థులు బోరు నీటినే తాగుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ వ్యాధి వస్తుందేమోనని విద్యార్థులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వర్షాల సమయంలో బురద నీరు వస్తున్నా తాగక తప్పడం లేదని అంటున్నారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎన్ని సార్లు అధికారులకు వినతులు అందించినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. రెగ్యులర్ బోధనా సిబ్బంది ఇద్దరే ఉండడంతో చదువులు ముందుకు సాగడం లేదు. సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సిబ్బంది క్వార్టర్స్ కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాటిని వినియోగించకుండా వదిలేశారు. కొత్తవి నిర్మించాలని గురుకుల సొసైటీకి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. నివాస సౌకర్యం లేక గురుకుల కళాశాలకు రావడానికి సిబ్బంది వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పెద్దమడి గిరిజన బాలుర గురుకుల కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



శిథిలావస్థలో సిబ్బంది క్వార్టర్స్

తరగతి గదుల్లోనే పడుకుంటున్నాం..



మేము పడుకోవడానికి భవనాలు లేక తరగతి గదుల్లోనే నిద్రపోతున్నాం. తరగతి గదులకు చెక్క సున్నాలు చేయలేదు. కొన్ని సార్లు బెంచీలపై పడుకుంటున్నాం. నిద్ర సరిగా పట్టడం లేదు. పాఠాలు వినడానికి కూడా శ్రద్ధ కలగడం లేదు.

-ఎస్.కిరణ్, ఎంపీసీ సెకండియర్, పెద్దమడి గురుకులం

మంచి నీరు లేదు..



ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలోని గురుకుల పాఠశాలలో కలుషిత తాగునీరు తాగడంతో విద్యార్థులకు పచ్చకామెర్లు సోకినట్లు తెలిసి మాకు భయం వేస్తుంది. మేము బోరు నీటినే తాగుతున్నాం. ఆర్వో ప్లాంట్ లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆర్వో ప్లాంట్‌ను మంజూరు చేస్తే బాగున్ను.

-జె.అజయ్, ఎంపీసీ సెకండియర్, పెద్దమడి గురుకులం

అధికారులకు చెబుతున్నా ప్రయోజనం లేదు..



విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు. గచ్చులు లేని తరగతి గదుల్లో బోధన జరుగుతుంది. రెగ్యులర్ బోధనా సిబ్బంది లేరు. వారు ఉండడానికి వసతి లేకపోవడంతో ఇక్కడకు ఎవరూ రావడం లేదు.

-లక్ష్మణ్‌నాయుడు, ప్రిన్సిపాల్, గురుకుల కళాశాల, పెద్దమడి

టీచర్లకు కొత్త టె(స్ట్)ట్

(ఐదో పేజీ తరువాయి)

ఓసీ కేటగిరీ వారు 90మార్కులు (60శాతం) బీసీలు 75మార్కులు (50శాతం) ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు 60మార్కులు (40శాతం) సాధించాల్సి ఉంటుంది. ఎస్జీటీలైతే టెట్ పేపర్ -1 స్కూల్ అసిస్టెంట్లయితే పేపర్-2 రాయాలి. ఏ కేడర్ టీచర్లయినా 2030 సెప్టెంబరు 30 తేదీలోగా రిటైరయ్యేవారు మాత్రం టెట్ రాయనవసరంలేదని చెబుతున్నారు. కానీ ఈ వ్యవధిలో ఉద్యోగన్నతి పొందాలంటే మాత్రం టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. ఆ ప్రకారం ఐదేళ్లకు మించి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులందరూ 2027 సెప్టెంబరు 30 లోగా టెట్ అర్హత సాధించాల్సిందేనని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై డీఈవో రవిబాబును వివరణ కోరగా.. 'ఇన్ సర్వీస్ టీచర్లు టెట్‌లో అర్హత సాధించాలన్న విషయంపై సామాజిక మాధ్యమాల ద్వారానే నాకు తెలిసింది. దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక సమాచారం లేదు. ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తే టెట్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తాం' అని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఓపెన్‌హౌస్

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్‌శాఖ విధులు, సేవలు, ఆధునిక, సాంకేతిక వినియోగం, నేర నివారణ, రికార్డులు నిర్వహణ, ప్రజాభద్రతకు తీసుకుంటున్న చర్యలను పోలీసు అధికారులు వివరించారు. అలాగే విద్యార్థులకు పోలీసు సేవలపై అవగాహన కలిగించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏడు రోడ్ల కూడలి వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. ద్విచక్రవాహనదారు హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ఇటీవల అంబేడ్కర్ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహన దారుడికి హెల్మెట్ లేకపోవడంతోనే ప్రమాదం జరిగి మృతి చెందాడని గుర్తు చేశారు. నగరపరిధిలో ఏమీ కాదని అనుకోకుండా అజాగ్రత్తగా వాహనాలు నడిపి తమ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పలువురు వాహన దారులు పాల్గొన్నారు.

● లావేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ జి. లక్ష్మణరావు అన్నారు. పోలీసుల అవమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం లావేరు స్టేషన్‌లో జడ్పీ పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. ఎఫ్ఐఆర్, దొంగతనంలో స్వాధీనం చేసుకున్న వస్తువులను ఎక్కడ భద్రపర్చాలి, లాకప్, వైర్‌లెస్ సెట్ వినియోగం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషో పాధ్యాయ సంఘం అధ్యక్షుడు పిసిని వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బుధవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఎస్ ఐ సీపాన కాంతారావు రికార్డుల నిర్వహణ, వినియోగించే ఆయుధాలపై వివరించారు. ట్రైనీ ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ ఝూన్సీబాయి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం క్రైం: మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్

● శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నేర రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని ట్రైనీ ఎస్ఐ బి.మోహిని అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. పెద్దపాడు జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులకు పోలీసు విధులు, సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● హిరమండలం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు డైలీ డ్యూటీ చార్ట్, ఆయుధాలపై అవగాహన కల్పించారు.

● సోంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఎస్ఐ లోవరాజు విద్యార్థులకు పోలీసుల విధి నిర్వహణలను వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పిచ్చి మొక్కలు తొలగించారు


పిచ్చిమొక్కలు తొలగించిన తరువాత..

గార, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మ నాథ క్షేత్రంలోని దక్షిణ గోపురంపై మొలిచిన పిచ్చి మొక్కలను ఆలయ అధికారులు బుధవారం తొలగించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఈవో నరసింహనాయుడు స్పందించారు. పిచ్చి మొక్కలు తొలగించారు. భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెట్ల ర్యాంపు నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డువైపు మెట్ల ర్యాంపు నిర్మాణం చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద నిర్మిస్తున్న పింక్ టాయిలెట్లను బుధవారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. మరుగుదొడ్లలో ఏర్పాటు చేసిన సీలింగ్, నిర్మాణం పనులను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదానం


రక్తదానం చేస్తున్న తపాలా ఉద్యోగులు

అరసవల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తలసేమియా చిన్నారులు, సికిల్ సెల్ ఎనీమియా వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారికోసం తపాలా ఉద్యోగులు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం హెడ్ పోస్టాఫీసు ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లాలో రక్తం కొరత తీవ్రంగా ఉందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు కోరారు. ఈ సందర్భంగా 20 మంది రక్తదానం చేయగా వారికి ప్రశంసా పత్రాలు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, జి.రమణ, విశ్వేశ్వరరావు, కామేష్ చంద్ర పాత్రో తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు తక్కువగా చెల్లింపు

● దుకాణదారులపై కార్మిక శాఖ చర్యలు


వేతనాల డీడీలను అందజేస్తున్న కార్మికశాఖ అధికారులు

పాత శ్రీకాకుళం/అరసవల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పలు దుకాణాల్లో కార్మికులకు వేతనాలు తక్కువగా చెల్లిస్తున్నట్లు జిల్లా కార్మిక శాఖ గుర్తించింది. ఈమేరకు చర్యలు తీసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం ఉపకార్మిక కమిషనర్ కార్యాలయంలో బుధవారం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ప్రకారం ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తుల ఆధారంగా పలు దుకాణాలు, ప్రైవేటు సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. 13 మంది కార్మికులకు తక్కువగా వేతనాలు చెల్లిస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ విషయమై ఉపకార్మిక కమిషనర్ కె.దినేష్‌కుమార్ చర్యలు చేపట్టారు. సంబంధిత దుకాణ యాజమానుల నుంచి రూ.92,874 కార్మికులకు చెల్లించేలా ఆదేశాలిచ్చారు. వెనువెంటనే దుకాణదారులు డీడీల రూపంలో కార్మికులకు సదరు మొత్తాన్ని చెల్లించారు. కార్మికులకు ఎక్కడైనా కనీస వేతనాల చట్టం అమలుకాకుంటే ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి

అరసవల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ సేవలను తక్షణం పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గసభ్యుడు పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ● పీఏసీఎస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్

ఇచ్ఛాపురం, అక్టోబరు 22(ఆంధ్ర జ్యోతి): విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి వారికి న్యాయం చేస్తామని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ అన్నారు. బుధ వారం ఎంపీఐ కార్యాలయం ఎదురుగా బస్సుజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌ను మరిచి కేంద్రంలోని బీజేపీతో సీఎం చంద్రబాబు నాయుడు రాజీ పడ్డారని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో చాలా కళాశాలల్లో సరైన బోధన సిబ్బంది, ప్రయోగశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విదేశాల్లో చదవాలని ఉన్నా ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడంతో విదేశీ చదువులకు విద్యార్థులు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల సమస్యలపై బస్సుయాత్ర చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబళ్లవలస టీచర్ సస్పెన్షన్

గార, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అంబళ్లవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నీలాపు రామారావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులిచ్చారని ఎంఈవో నక్క రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం కారణంగా గ్రామస్థులు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఆయన ఆదేశాలతో డీఈవో సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో పేర్కొన్నారు.

రుణ ప్రణాళిక లక్ష్య సాధనకు చర్యలు

● డీఆర్‌డీఏ పీడీ

పొందూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డ్వాక్రా గ్రూపులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.2,928 కోట్లతో చేపట్టిన సూక్ష్మ రుణ ప్రణాళిక లక్ష్యం నెరవేరే దిశలో చర్యలు తీసు కుంటున్నామని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానికంగా వీవోఏలు, సీఎస్‌లు, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే బ్యాంకుల ద్వారా రూ.2,356 కోట్లు రుణాలు మంజూరు చేయించామన్నారు. సూక్ష్మ రుణ ప్రణాళికలో రూ.1830 కోట్లు వ్యవసాయ అనుబంధ రుణాలు, ఫిషరీస్ రంగం ప్రోత్సాహానికి రూ.123 కోట్లు, హార్టికల్చర్‌కి రూ.27 కోట్లు, పశుసంపదకి రూ.347 కోట్లు, సెరికల్చర్‌కు రూ.కోటి అందించడం లక్ష్యమన్నారు. లక్ష్య సాధనలో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్‌రావు, రామచంద్రరావు, ఏపీఎంలు జి.శ్యామలరావు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతి పాఠశాల సీజ్

● రూ.30 లక్షల ఈఎస్ఐ బకాయిలు
● కార్మికశాఖ అధికారుల చర్యలు
● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు


సీల్ వేసిన దృశ్యం

ఆమదాలవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరదా వారి క్వార్టర్స్ వీధిలో ఉన్న రవీంద్ర భారతి పాఠశాలను విశాఖపట్నం కార్మిక శాఖాధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అధికారులు చేరుకుని పాఠశాలలో ఉన్న విద్యార్థులను


ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బయటకు పంపి ప్రధాన ద్వారానికి తాళాలు వేసి సీల్ వేశారు. పాఠశాల యాజమాన్యం ఈఎస్ఐకి సమారు రూ.30 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉందని పలుమార్లు నోటీసులిచ్చినప్పటికీ స్పందించలేదని, అందుకు పాఠశాలను సీజ్ చేస్తున్నట్టు కార్మికశాఖ రికవరీ అధికారి జి.వేణుమాధవ్ ఆదేశాలతో కూడిన నోటీసులను పాఠశాల గోడలపై అంటించారు. పాఠశాలను సీజ్ చేసిన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని విద్యార్థుల భవిష్యత్ ఏమిటని ప్రశ్నించారు. దీనికి ఈఎస్ఐ అధికారులు సమాధానమిస్తూ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాలను సకాలంలో చెల్లించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తమను ప్రశ్నించడం కాదని, అటువంటి యాజమాన్యాన్ని ప్రశ్నించి పిల్లల భవిష్యత్‌ను నిర్ధా రించుకోవాలన్నారు. దీనిపై తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం మధ్యలో అర్థాంతరంగా పాఠశాలను మూసి పిల్లల భవిష్యత్తును నాశనం చేయవద్దని, డీఈవో తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి

● ఎమ్మెల్యే రవికుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పన్నులను సకాలంలో చెల్లించి ఆమదాలవలస పట్టణాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మునిసిపాలిటీకి రావాల్సిన పన్నులను చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం మునిసిపల్ ప్రాంతాల్లో స్థల క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పించిందని, దీనిని వినియోగించుకోవాలన్నారు. గతంలో రోడ్ల ప్లాన్ అప్రూవల్‌కు కష్టతరంగా ఉండేదని, ప్రస్తుతం పది అడుగుల రహదారి కూడా ప్లాన్ అప్రూవల్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు మునిసిపల్‌శాఖ నిబంధనలతో అనుమతులు పొందాలన్నారు. అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లలో నిర్మాణాలు చేపడితే మునిసిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు, సేవలు ఉండవని స్పష్టం చేశారు. కార్య క్రమంలో కమిషనర్ టీవీ రవి, పీఏసీఎస్ అధ్యక్షురాలు సిమ్మ మాధవి, నారాయణ పురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లీశ్వర రావు, ఎంపీటీసీ అన్నెపు భాస్కర రావు, పీవీకే రాజు పాల్గొన్నారు.

పశు సంరక్షణకు చర్యలు: శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ ద్వారా పశు సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కిల్లిపాలెంలో పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్థక శాఖల ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన, పశు పెర్టిలిటీ క్యాంపును ప్రారంభించారు. లేగదూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీడీ డా.గణపతిరావు, అరసవెల్లి వెటర్నరీ డిస్పెన్సరీ వైద్యాధికారి దిలీప్, గ్రామ పెద్దలు రమణమూర్తి, జ్యోతి, ఏఎంసీ మాజీ చైర్మన్ మూకళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో భవనాన్ని పూర్తి చేయండి

అరసవల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ నిర్మిస్తున్న సమగ్ర భవన సముదాయాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను కోరారు. బుధవారం సదరు భవనాన్ని సందర్శించారు.

సమస్యలు పరిష్కరించకుంటే 3 నుంచి సమ్మె

● మునిసిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నేతలు


ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే నవంబరు 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పల రాజు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా చనిపోయిన, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉపాధి కల్పించాలన్నారు. 12వ పీఆర్సీని ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. పట్టణాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, శాశ్వత కార్మికుల పెండింగ్ బకాయిలు విడు దల చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అర్జి మణి, ఆర్.గణేష్, గురుస్వామి, చంద్రరావు, పొట్నూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో లోపాలుంటే బిల్లులు నిలుపుదల

పొందూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, కాలువ పనుల్లో నాణ్యత పాటించాలని, నిబంధనలు పాటించకుంటే బిల్లులు నిలుపుదలతో పాటు చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోల్ డీఈ రామకృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలో పల్లెపండగ పథకంలో ఎన్‌ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్ నిధులతో నిర్మించిన రోడ్లను బుధవారం పరిశీలించి నాణ్యతను పరీక్షించారు. ప్రతీ రోడ్డును పరిశీలించాకే బిల్లుల మంజూరుకు అనుమతిస్తామన్నారు. పొందూరులో పలు రోడ్ల నాణ్యతను పరీక్షించారు. పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, ఎ. చినరంగ పాల్గొన్నారు.

స్వదేశానికి మత్స్యకారులను తీసుకువస్తాం

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):బంగ్లాదేశ్ నౌకాదళం అధీనంలో ఉన్న విజయనగరానికి చెందిన 8 మంది మత్స్యకారులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇప్పటికే భారత ప్రభుత్వం నుంచి విదేశీ మంత్రిత్వ శాఖ ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి మత్స్యకారులను వెనక్కు తీసుకు వచ్చేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. దీనికి సంబంధించి భారత ప్రభుత్వానికి లేఖ రాశామని పేర్కొన్నారు. మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధైర్య పడవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి


యశ్వంత్ (ఫైల్)

కవిటి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కవిటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కోళ్ల యశ్వంత్ బుధవారం మృతి చెందాడు. పాఠశాలలో మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే గ్రామస్థులు కవిటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం బరంపురం ఎంకేసీజీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. యశ్వంత్ బ్రెయిన్ సంబంధిత వ్యాధితో మృతి చెందినట్టు గ్రామస్థులు చెబుతున్నారు. దీపావళి పండుగను గ్రామంలో అందరితో కలిసి ఉత్సాహంగా జరుపుకొన్నాడని, అంతలోనే మృతి చెంద డంతో తోటి విద్యార్థులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు.

బావిలో పడి వ్యక్తి ..

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక దేశవానిపేటకు చెందిన మానసిక దివ్యాంగుడైన ఇట్రాజు జనార్దనరావు (45) బుధవారం వీధి శివారులో బావిలో పడి మృతిచెందినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. జనార్దన్ గాకన శివారును గల బావిలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఇతడి తల్లి నరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

డీజీ పురంలో అమరవీరుల దినోత్సవం


మాట్లాడుతున్న పోలీసు అధికారులు

సంతబొమ్మాళి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దండు గోపాలపురం (డీజీపురం) జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ ఎస్పీ ఐదో బెటాలియన్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల దినోత్స వాన్ని బుధవారం నిర్వ హించారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు, అమరవీరులు హెడ్‌కానిస్టేబుళ్లు పి.లక్ష్మణరావు, పి.కృష్ణారావు సేవలు స్మరించుకొనేందుకు పాఠశాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు రిజర్వ్ ఇన్‌స్పెక్టరు మనోహర్, ఆర్ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పిట్ట గంగన్న, ఉపాధ్యాయులు భాస్కరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సేవల్లో అలసత్వంపై ఏడీ నిలదీత


ఏడీ ప్రసాదవర్మను ప్రశ్నిస్తున్న రైతులు

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పశువైద్య సేవలు అందించడంలో వైద్యుల నిర్లక్ష్య వైఖరి వీడనాడాలని పాడిరైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం స్థానిక దేశవానిపేట పశువైద్యశాలకు వైద్యులు సకాలంలో రాకపోవడంపై ఏడీ ప్రసాదవర్మను నిలదీశారు. గత నాలుగు నెలలుగా పశువైద్యసేవలను అందడంలేదని.. వైద్యులు ఏ సమయంలో వస్తున్నారో తెలియక ఇబ్బంది పడుతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వైద్యం అందక పశువులు మృతిచెందినట్టు రైతులు నడిమింటి నర్సింహాలు, బగ్గు రవి అన్నారు. ఏడీ ప్రసాదవర్మ స్పందించి ప్రతీ రోజు వైద్యసేవలను అందించడం జరుగుతుందని వైద్యులను డిప్యూటేషన్ పద్ధతిలో వేయడం జరుగుతుందని తెలిపారు. ఆందోళనలో దేశవానిపేటకు చెందిన పంగ చిన్నికృష్ణ, మెయ్యశ్రీను తదితరులు పాల్గొన్నారు.

టెక్కలికి బస్సు సౌకర్యం కల్పించాలి


కొత్తూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొత్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రం నుంచి డివిజనల్ కేంద్రం టెక్కలికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం కొత్తూరులో సీపీఎం నాయకులు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సుదూరు ప్రాంతంలో ఉన్న టెక్కలికి వివిధ పనులపై ప్రజలు వెళ్లాలంటే నాలుగు బస్సులు మారాల్సి వస్తుందని, దీంతో ప్రజలు అవస్థ పడుతున్నారంటూ నినాదాలు చేశారు. వీటితో పాటు మండలంలో మారుమూల ప్రాంతాలైన గొట్టిపల్లి, ఆకులతంపర, అంగూరు, దిమిలి, పోనుటూరు, కడుమ గ్రామాలకు బస్సులు పునద్ధరించాలని కోరారు. సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, దుర్గారావు, జమ్మయ్య, రమేష్, గణపతి రాములు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎలుకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వరిలో ఎలుకల నియంత్రణకు రైతులు తగు సూచనలను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు పి.ఉదయబాబు, వై.సురేష్ సూచించారు. బుధవారం కోమర్తి గ్రామంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్‌యోజన పథకంలో భాగంగా పంటల పరిస్థితుల పై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలుకల బెడద ఎక్కువగా ఉందని రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలకు తెలిపారు. ఎలుకలు నివారణకు గట్ల పరిమాణం తగ్గించాలని అలాగే బ్రోమోఫుమిగాటర్‌తో పొగపెట్టాలని అలాగే సామూహిక నివారణ చర్యలు చేపట్టేందుకు రైతులు ఎలుకల బోనులతో నివారించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సూర్యకుమారి, ఏఈవో ప్రసాద్, వీఏఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

జలుమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుండి 30 వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో బి.చిన్నమ్మడు తెలిపారు. ఈ నెల 23 నుండి 25 వరకు మూడు రోజులపాటు చల్లవానిపేట విజ్ఞానదుర్గ పాఠశాలలోను, జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, ఆదర్శ పాఠశాల కరవంజలోను ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. అలాగే ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నాలుగు రోజులపాటు చల్లవానిపేట విజ్ఞానదుర్గ జూనియర్ కళాశాలలో, జలుమూరు కేజీబీవీలోను, తిమడాం గీతాంజలి స్కూల్‌లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఆధార్ కేంద్రాలను సద్వినియోగ పరచుకోవాలని ఆమె కోరారు.

ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు పార్టీ పిలుపు మేరకు పెద్దపాడు క్యాంప్ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణను బుధవారం చేపట్టారు. సామాన్యులకు విద్య, వైద్యం, ప్రభుత్వం అందించే దిశగా అడు గులు వేయాలే తప్ప, మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు.

ఘనంగా కొమరంభీమ్ జయంతి

టెక్కలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జైభీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతిని బుధవారం ఆర్టీసీ గ్యారేజ్ వద్ద నిర్వహించారు. డిపో జైభీమ్ అధ్యక్షుడు బి.ధనుంజయరావు మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించిన కొమరంభీమ్ స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌టీ రావు, వీకే దేవ్, వైకే రావు, కుమార్, రమణ తదితరులు ఉన్నారు.

స్పందించని అధికారులపై చర్యలు తప్పవు

● మంత్రి అచ్చెన్నాయుడు


సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమస్యలపై తమ కార్యాలయాలకు వచ్చే ప్రజలను పట్టించుకోని అధికారులపై చర్యలు తప్పవని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై కార్యాలయాలకు వెళుతుంటే కొందరు అధికారులు పట్టించుకో కుండా పదేపదే తిప్పుతున్నారని ప్రజలు మంత్రి వద్ద మొరపెట్టుకున్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ప్రజా సమస్యలు పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తికి సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిం చాలని, నూతన పింఛన్లు, గృహాలు మంజూరు చేయాలని పెద్ద ఎత్తున మంత్రికి వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బగాది శేషగిరి, పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నేతలు సంబాళ శ్రీనివాస్, వెలమల కామేశ్వరరావు, పినకాన అజయ్ కుమార్, బోయిన సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిరక్షణకు చర్యలు

టెక్కలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల పరిరక్షణకు చొరవ చూపాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తితో పాటు టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తహసీల్దార్లు సత్యం, అప్పలరాజు, శ్రీనివాసరావులతో సమావేశమై మండలాల వారీగా ప్రభుత్వ భూముల వివరాలు ఆరాతీశారు. చింతలగార, జగతిమెట్ట, అంజనాపురం, చేరివీధి లేఅవుట్లలో ఎన్ని స్థలాలు ఖాళీగా ఉన్నాయి? ఎంతమందికి పట్టాలు ఇచ్చారనే వివరాలు ఆరాతీశారు. జగతిమెట్ట లేఅవుట్‌లో 389 పట్టాలకు గాను 416 ప్లాట్లు ఉండగా... అందులో 18 ప్లాట్లు తొలగించామని తహసీల్దార్ తెలిపారు. కోటబొమ్మాళి మండలంలో 43 లేఅవుట్లలో 400 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని.. అర్హులైన వారి నుంచి అర్జీలు తీసుకొని వాటిని పంపిణీ చేయొచ్చని చెప్పారు. సంతబొమ్మాళి మండలంలో రైతు సమస్యలపై వివరాలు సేకరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరాన్ని మంత్రి పరిశీలించారు. బగాది శేషగిరిరావు, జనసేన ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, మామిడి రాము, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో మల్లన్న ఆలయం అభివృద్ధి

టెక్కలి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం రావివలస ఎండల మల్లన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీసులు, దేవదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఎస్పీ లక్షణరావు, ఈవో గు రునాథరావు, తహసీల్దార్ బి.సత్యం, ఎంపీడీవో రేణుక, టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం


మాట్లాడుతున్న న్యాయాధికారి హరిబాబు

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయాధికారి పి.హరిబాబు అన్నారు. బుధవారం స్థానిక సబ్‌జైలును ఆయన పరిశీలించారు. ఖైదీలతో మాట్లడి సబ్‌జైల్‌లో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయసహాయంను వినియోగించుకోవాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయంపై అవగాహన చేయాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, రోణంకి కృష్ణంనాయుడు, తూలుగు మధుసూధనరావు, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం ఆవరణలో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. పలాస నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ ఇక్కడ ఇచ్చిన వినతులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి పట్టాల కోసం అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. ఆయా మండలాల అధికారులకు పంపించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాతావరణశాఖ సూచనల మేరకు రానున్న మూడు, నాలుగు రోజుల్లో తుఫాన్ రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మండలప్రత్యేకాధికారి మంచు కరుణాకర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తుఫాన్ రోజుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల మండల స్థాయి అధికారులను వివరించారు. తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతి పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వి.రవీంద్ర, పశువైద్యాధికారి పి.అనిల్, విద్యుత్‌శాఖ జేఈ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఎచ్చెర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు కోరారు. అరిణాం అక్కివలస నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ వద్ద బుధవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు అంబటి సత్యనారాయణ, పి.సుధాకర్, కేదారేశ్వరరావు, గణపతి, రమణ పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

అరసవల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పరిధిలో నీటిముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ పౌర సంక్షేమ వేదిక నాయకులు ఎం.గోవర్ధనరావు, ఎం.ఆది నారాయణమూర్తి కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని అన్ని కాలనీల్లో మురుగు కాలువలు ఏర్పాటు చేసి ప్రధాన కాలువలకు అనుసంధానం చేయాలని కోరారు. రిజర్వు స్థలాలు, ఖాళీ స్థలాల్లో ఉన్న మురుగునీటిని తక్షణం బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

సేవలు మరువలేనివి

పలాసరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు గ్రామానికి చెందిన బొడ్డు అప్పారావు సేవలు మరువలేనిదని జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర డిల్లీరావు అన్నారు. బొడ్డపాడు గ్రామానికి చెందిన బొడ్డు అప్పారావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. బొడ్డపాడు గ్రామాభివృద్ధిలో, పాఠశాల ఏర్పాటులో, బీసీ హాస్టల్ ఏర్పాటు, గ్రామానికి మంచినీటి ఏర్పాటు, గ్రామంలో నాడు యువజన సంఘాల ఏర్పాటు వంటి అంశాల్లో ఆయన చేసిన కృషి మరువలేమని తెలిపారు.

సందడిగా గౌరమ్మ ఉత్సవాలు

నందిగాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో నందెమ్మ ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. నందిగాం, దేవుపురం, పెంటూరు, కణితివూరు తదితర గ్రామాల్లో ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలను పురస్కరించుకొని పగటివేషాలతో సందడి చేశారు. భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తన స్వగ్రామం తామరలోని కోదండరామాలయంలో బుధవారం జరిగిన అఖండ నామసంకీర్తన భజనాది కార్యక్రమాలలో పాల్గొన్నారు.

రహదారి కల్పిస్తాం..

మెళియాపుట్టి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి-పలాస రోడ్డు నుంచి మహేంద్రతనయ నదికి వెళ్లేందుకు రహదారి కల్పించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కోసమాల, గొప్పిలి గ్రామాల్లో పర్యటించారు. గొప్పిలిలో జగనన్న కాలనీకి వెళ్లేందుకు రహదారి లేక ఇబ్బంది పడుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. పలువురు టీడీపీ నాయకులను పరామర్శించారు టీడీపీ నాయకులు సలాన.మోహనరావు, మండల ప్రదానకార్యదర్శి బోచ్చు ప్రసాదరావు, చదినకరరావు, ఎస్.వెంకటరావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, తదితరులు ఉన్నారు.

30లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీలోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె. జగన్మోహన్‌రావు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోగల పెద్ద బమ్మిడి గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈనెల 30 లోగా శతశాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఏవో ఎస్.గోవిందరావు, వ్యవసాయ సహాయకులు ఎం.మాధవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

గుజరాతీపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెం. 57ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించడంపై 2003 డీఎస్సీ ఏపీ ఫోరమ్ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం భేటీలో సీఎం ప్రకటించడంతో రాష్ట్రంలో సుమారు 11వేల ఉద్యోగ, ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానం గుర్తింపు చేసేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ పక్షపాతిగా నిరూపించుకుందని పేర్కొంటూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తంచేసిన వారిలో ఫోరమ్ జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి, రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీనివాసరావు, జిల్లా కో కన్వీనర్లు ఎ.లక్ష్మణరావు, ఎ.తిరుమలేశ్వరరావు, శ్రీకర్ తదితరులున్నారు.

గుగ్గిలిలో తాగునీటి కష్టాలు

జలుమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుగ్గిలిలో గల రక్షిత నీటి పథకం పైపులైన్ పోవడంతో తాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. ఈ పథకం ద్వారా గుగ్గిలి, గుండువలస, తాళ్లవలస గ్రామాలకు ఇంటింటా కుళాయిలు ద్వారా అందించేవారు. రెండు వారాలు కిందట పైపులైన్ పాడవడంతో గ్రామాలకు సరిపడ తాగునీరు అందడం లేదు. దీంతో గ్రామంలో ఒకేచోట తాగునీరు పట్టుకోవాల్సి రావడంతో వారంతా ఇబ్బందిపడుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైను బాగుచేయించి పూర్తిస్థాయిలో తాగునీరు అందివ్వాలని కోరుతున్నారు. దీనిపై సర్పంచ్ కరవంజ పార్వతి మాట్లాడుతూ.. రక్షిత నీటి పథకం నుంచి గ్రామాలకు వచ్చే పైపులైన్ పోవడం వల్ల గ్రామాలకు సరిపడ తాగునీరు అందడం లేదన్నారు. అయితే వరిపొలాల్లో పైపులైన్ పాడైపోవడంతో గుర్తించడానికి ఇబ్బందిగా మారిందన్నారు. అందుకే ఇంటింటా కుళాయిలు నిలుపుదల చేసి గ్రామంలో ఒకటి, రెండు చోట్ల కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నామన్నారు. వరి కోతలు పూర్తయిన తర్వాత పైపులైన్ బాగుచేసి తిరిగి కుళాయిల ద్వారా ఇంటింటా తాగునీరు అందిస్తామన్నారు.

సుంకయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం


సుంకయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న కలమట

మెళియాపుట్టి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ గిరిజన సంఘం నాయకుడు సవర సుంకన్న కుటుంబాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి పరామర్శించారు. సుంకయ్యకు టీడీపీ అంటే ప్రాణంగా చూసుకొనేవారన్నారు. పార్టీ ఏర్పాటు నుంచి పార్టీలో కొనసాగిన వ్యక్త సుంకయ్యని తెలిపారు. అంతకుముందు కొసమాల గ్రామంలో పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. టీడీపీ నాయకులు వసంత్, తదితరులు ఉన్నారు.

ఎస్‌టీయూ నూతన కార్యవర్గం

జలుమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అల్లాడ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) నూతన కార్యవర్గం బుధవారం ఏర్పాటు చేసారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా బొడ్డేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా అంబటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సీపాన రామచంద్రరావు, కార్యదర్శిగా ఎం.శ్రీకాంత్, ఆర్థిక కార్యదర్శిగా ఎం.కృష్ణారావు, జిల్లా కౌన్సిలర్లుగా కె.భాగ్యలక్ష్మి, కె.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రహదారి మరమ్మతులకు నిధులు

సంతబొమ్మాళి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వడ్డితాండ్ర-రావివలస రహదారి మరమ్మతులకు రూ.45 లక్షలు నిధులు మంజూరైనట్టు ఈ రహదారి సాధన కమిటీ కన్వీనర్ కోత మధుసూధనరావు తెలిపారు. ఇటీవల ఈ రహదారి దుస్థితిపై టెక్కలి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. కాగా 6.2 కిలోమీటర్ల గల ఈ రహదారి విస్తరణకు రూ.18కోట్లతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినట్టు టెక్కలి ఆర్‌అండ్‌బీ ఏఈ జగదీష్ తెలిపారన్నారు. త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారని, ఇందుకు సహకరించిన వారికి కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలు

ఎల్ఎన్ పేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతుల్లో వ్యవసాయం సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆమదాలవలస వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త జ్యోతిబసు తెలిపారు. యంబరాం గ్రామంలో బుధవారం వరి, అపరాల పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నానో ఎరువుల వాడడం వల్ల భూసారం తగ్గకుండా పంటలు అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ క్షేత్రినాథులు, సర్పంచ్ వి.గోవిందరావు, వ్యవసాయాధికారులు పి.కిరణ్‌వాణి, ఎం.రేణుకాసాయి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ

టెక్కలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో గల 108 వాహనాలను బుధవారం డివిజన్ పర్యవేక్షణ అధికారి రంగప్రసాద్ తనిఖీ చేశారు. వాహనాల్లో పరికరాలు, మందులు, రికార్డులు, 108 సేవలు పరిశీలించారు. 108 సేవలు వినియోగించుకునేలా చూడాలన్నారు.

యాప్‌తో మద్యం నాణ్యత తెలుసుకోవచ్చు

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసిన మద్యం ప్రభుత్వం పంపిణీ చేసిన కాదా అని సులువుగా తెలుసుకునేందుకు సురక్ష యాప్‌ను వినియోగాదారులు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎక్సైజ్‌శాఖ సీఐ పి.లీలా, ఎస్ఐ గురుమూర్తి సూచించారు. బుధవారం నరసన్నపేట పట్టణంలో పలు షాపుల వద్ద మద్యం వినియోగదారులకు సురక్ష యాప్ వినియోగంపై అవగాహన నిర్వహించారు. మద్యం దుకాణాల్లో మద్యం నాణ్యతను ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఎప్పటికప్పుడు పరిశీలించి షాంపిల్స్ తీసుకోవాలన్నారు. ఎస్ఐ గురుమూర్తి ఉన్నారు.

పంటలు పరిశీలన

ఎల్ఎన్ పేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): లోతట్టు గ్రామాలైన తురకపేట, దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి ధనుకువాడ, కోవిలాం తదితర గ్రామాల్లో రెండు రోజుల కిందట వీచిన బలమైన గాలులకు నేలకొరిగిన వరిచేలను బుధవారం వ్యవసాయాధికారి పి.కిరణ్‌వాణి పరిశీలించారు. నేలకొరిగిన వరిచేలుపై నుంచి నీరు ప్రవహించకుండా చూసుకుంటే ఎలాంటి పంటనష్టం ఉండదన్నారు. పంట నష్టంపై జిల్లా అధికారులకు నివేదికలు అందించనున్నట్టు తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంటు బి.పద్మజ తదితరులు ఉన్నారు.

ఆలయ హుండీల లెక్కింపు

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపును దేవదాయశాఖ అధికారులు చేపట్టారు. ఆలయ ఈవో మాధవి ఆధ్వర్యంలో చేపట్టిన లెక్కింపు 138 రోజులు గాను రూ.2,05367 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొట్నూరు చిన్నవీరభద్రస్వామి, అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు, అప్పలచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి

పాతపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సేవలు వినియోగించుకోవాలని బ్రెడ్స్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జేవీ రమణ తెలిపారు. రొంపివలస పంచాయతీ పెద్ద సున్నాపురం గ్రామంలో బ్రెడ్స్ ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజనులకు గ్రామ సచివాలయ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తల్లికి వందనం అన్నదాత సుఖీభవ ఉపాధిహామీ పీఎం కిసాన్ పీఎం జూడన్ తదితర పథకాలపై వివరించారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సవర ఆనందరావు కార్యదర్శి పి.అమరావతి, రొంపివలస సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్బర్ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగరంపల్లి హైస్కూల్ హెచ్‌ఎం టి.హేమారావు సూచించారు. బుధవారం స్థానిక హైస్కూల్‌లో టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీస్) కంపెనీ ప్రతినిధులు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో ఎస్.నవదీప్, ఎన్.రిషీత్, టి.శ్రావణి,, జూనియర్ విభాగంలో డి.జ్యోతి, బి.హర్షవర్ధన్, హెచ్.గౌతమ్ వరుసుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు బహుమతులు అందించారు.

21 నుంచి..

● గుజరాతీపేట: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, మేనేజ్‌మెంట్ పాఠశాలల 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు డీఈవో ఎ.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 21, 22వ తేదీల్లో, మండలస్థాయిలో ఈ నెల 24, 25 తేదీల్లో, నియోజకవర్గ స్థాయిలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజేతలకు నవంబరు 24, 25, 26 తేదీల్లో శాసనసభ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

ఎచ్చెర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొయ్యాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బడివానిపేట, కుప్పిలి ఫీడర్లలో చెట్లకొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యాం, నిమ్మవానిపేట, కొత్తవానిపేట, కుప్పిలి, బడివానిపేట, బుడగట్లపాలెం, ఎస్ఎస్ఆర్ పురం, చినరావుపల్లి, జరజాం తదితర గ్రామాల్లో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● జి.సిగడాం: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గెడ్డకంచరాం, టీడీ వలస ఫీడర్ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ లైన్‌లకు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలు, ముళ్ల పొదలు తొలగిస్తున్నందున పెంట, నాగులవలస, గెడ్డకంచరాం, బాతువ, టీడీవలస, మద్రివలస, నడిమివలస, శేతు భీమవరం, సీతంపేట, ఎందువ తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● ఆమదాలవలస: 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఎఫ్‌సీఐ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సొట్టవానిపేట, అక్కివలస, పంతులుపేట, టీజీ నగర్, సప్తపురాలు, చింతాడ ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

● కవిటి: బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీలో పనుల కారణంగా ఆరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. బొరివంక, మాణిక్యపురం, దూగానపుట్టుగ, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ పంచాయతీల సరఫరా ఉండదన్నారు.

● ఇచ్ఛాపురం: విద్యుత్ మెయింటినెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు టౌన్ పరిధిలో రత్తకన్న, మండల పరిధిలో మండపల్లి, తోటూరు, మశాఖపురం, జగన్నాథపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు గవనించాలన్నారు.

● నరసన్నపేట: ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోగల అన్నీ గ్రామాల్లో ఈనెల 24న ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ నరసింహకుమార్, ఏఈ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టనుండడం వల్ల సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.